# బ్రతక నేర్చిన మనిషి

♦ రచన : శ్రీ డి. కృష్ణా. ♦



సమయం సాయంత్రం ఆరున్నర ప్రాంతం నేలయీనినట్లు రోడ్లు వెంటనడిచే జనసమూహం. ప్రతిముఖంలో ఆత్రుత క్షణం మించితే యీలోకంలో అమూల్య వస్తువు జారిపోతుందన్నట్లు తహతహ.

రిక్షాలు, కార్లు—రకరకాల కార్లు, మోటారు హారన్‌లు ఒకే శబ్దం. చెవులు చిల్లులు పడేటట్టు హోరెత్తే శబ్దం రోడ్డు వెంట రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు రకరకాల భాషలు, ఎవరికి వారుగా జంటలు జంటలుగా, గుంపులు గుంపులుగా సాగిపోయే జనప్రవాహం.

సీతాయమ్మ అప్పటికే వేపచెట్టుక్రింద తిష్ట వేసింది, అది యీనాడేం కొత్తకాదు. సంవత్సరాలు తరబడిగా సాగిపోతున్న వ్యవహారమే అది.

అటు పశ్చిమ శిఖరాల లోయలో అరుణుడు మునక వేయడం యిటు సీతాయమ్మ వేపచెట్టుక్రింద గోనె సంచి పరచడం యించుమించు నిముషాల తేడాలో జరిగే పని.

సీతాయమ్మ అంతకుముందు కాలమయిన పగలంతా ఏం పనిచేస్తుందో ఎవరికి తెలీదు. ఏదో కష్టమయిన పనే చేస్తుందని ఆమె ముఖాన్ని చూస్తేనే చెప్పొచ్చు. ఏంపని చేసిన చేయకపోయినా సాయంకాలానికల్లా వేపచెట్టు క్రింద మాత్రం రోజూ అగుపించేది.

సీతాయమ్మ వ్యాపారం వడలు, బోండాలు యిత్యాది కారపు సామాన్లు తయారుచేసి అమ్మడం. సాయంకాలానికి కల్లా కావాల్సిన సామానులు, ముడిసరుకులు తెచ్చి ఆ చెట్టుకింద ఓకోటిగా అమర్చుకొంటూంటుంది. ఆ అమర్చుకోడంలో ఓ ప్రత్యేకత. ఆమె తయారుచేసే వస్తువులలో నాణ్యత అందుకే ఆమె అంగడికి పెద్ద పెద్ద ఆఫీసర్లు నుండి, చిన్న గుమస్తాలు దాకా కొనుగోలు చేయడం జరుగుతుంది.

రాత్రి పదిగంటలకల్లా అంగడి కట్టేసి వెళ్ళిపోతుంది. మరుసటి సాయంకాలముగాని మరలా ఆ ప్రాంతాల్లో అగుపించదు. ఇదీ సీతాయమ్మ దైనందిన చర్యలలో కొంత భాగమేనేమో!

అప్పటికే తొమ్మిదిగంటలు కావొస్తూంది. పనులు సూటిక తెమలక నా మనస్సు అసలే కొంత చిరాగ్గా వుంది. యిలాంటి చిరాకు సమయాల్లో నాకు ప్రాణమిత్రుడిగా మనశ్శాంతి నిచ్చేది రెండే రెండు. మొదటిది సిగరెట్టు, రెండవదిగా ప్రశాంత వాతావరణంలో తదేకంగా శూన్యంలోకి చూస్తూండడం. జేబు తడిమి చూసుకొన్నాను యింతో అంతో చిల్లర డబ్బులు చేతికి తగిలాయి. ఓ రెండు సిగరెట్టు పీకలు, ఓ నిప్పులు పెట్టెతో దగ్గరగా వున్న పార్కులో అడుగు పెట్టాను.

ఆ పార్కుకు సీతాయమ్మ అంగడికి మహా అవుతే వందగజాలు దూరముంటుంది. సిగరెట్టు పీక పీలుస్తూన్నానే గాని నా ధ్యాసంతా వేపచెట్టుక్రింద సీతాయమ్మతో కొలువుదీరిన ఆ మనుష్యులమీదే ఉంది. ఆకారాలు చూస్తే మంచి డబ్బున్న వాళ్లలాగే అగుపిస్తూన్నారు. ఒకడైతే యించుమించు ఆమెమీద వాలిపోయి ఏమిటేమిటో చేస్తున్నాడు. ఆమెకూడా ఎదో చిరునవ్వుల దరహాసంతో కొసచూపులతో అదోవిధంగా చూస్తూంది.

ఇంతలో ఓ పిల్లాడు ఏవో సీసాలు పట్టుకొచ్చి అందించాడు. బహుశా వాటి పేర్లు యిథమిద్యగా చెప్పలేకపోయిన అది మత్తుద్రవమని చెప్పేందుకు మాత్రం యిట్టే ఆలోచించ నక్కర్లేదు.

ఆ మందితో పాటు సీతాయమ్మకూడా మంచి నీళ్ళులా గుట గుటతాగేసింది. నాకు సహజంగానే ఆశ్చర్యం వేసింది. అంత పబ్లిక్ ప్లేస్‌లో అలా వారు నిరభ్యంతరంగా నిర్భయంగా త్రాగుడు సాగిస్తున్నారంటే అది వాళ్ళకీనాడేం కొత్త కాదనిపించింది నాకు. మరి సీతాయమ్మ ఏమో... నామాత్రం నేనెప్పుడు చూళ్లేదు. బహుశా యిన్నాళ్ళు రహస్యంగా సాగిస్తూండాలి లేకపోతే అంత సునాయసంగా త్రాగడం చాలా కష్టం. అయినా ఎందుకో

నామనస్సు అమెపట్ల దురభిప్రాయాన్ని పొడచూపలేదు. అందుక్కారణం కొంతవరకు ఉండనే వుంది.

అవినేను ఉద్యోగంలో చేరిన కొత్తరోజులు. ఉద్యోగంతో సహా పూరుకూడా కొత్తది కావటంతో ప్రతిదానికి వేరొకర్ని ఆశ్రయించటమో, అభ్యర్థించడమో రివాజయి పోయింది.

అప్పట్లో ఉండడానికి ఓ రూముకోసం వీధులబడి అన్వేషణ సాగించాను. దాదాపు కనబడిన ఒకరిద్దరి మిత్రులతో, పరిచయలతో చెప్పిచూశాను. కానీ ప్రయోజనంలేక పోయింది. అలాంటప్పుడు ఓ మిత్రుడు సీతాయమ్మను పరిచయం చేశాడు. అదేం అదృష్టమో ఆ మరుసటిదినమే తూర్పుపేటలో ఓ మంచిరూము ఉంది వెళ్ళి చేరచ్చని చెప్పింది సీతాయమ్మ.

దాంతో ఆమంటే నాకెందుకో సానుభూతి. కాకపోతే కృతజ్ఞతభావమో చెప్పలేమగాని, ఆఫీసుకు వెళ్ళే ప్రతిరోజు అంగడి ముందు నిలిచి పదిపైసలునుండి ఏభైకు తక్కువకాకుండా చెల్లించుకోవడం అలవాటయి పోయింది.

ఆలోచనలనుండి తేరుకొనే సరికి చాలా సేపే అయినట్టుంది. అప్పటికే సీతాయమ్మ అంగడి కట్టేసి వెళ్ళి పోయింది.

♦ ♦ ♦ ♦

ఆ మరుసటి దినం ఎన్నో కారణాలతో ఆఫీసుకు శెలవు పెట్టేశాను. మరుసటిరోజు సాయంకాలానికి కళ్లా నాకళ్లు వేపచెట్టుక్రింద సీతాయమ్మకోసం వెదికాయి. ఊహూ.. రాలేదు. నిన్న కూడ వచ్చిన ఆ చాకీలు కనబడటం లేదనుకున్నాను.

ఎందుకు రాలేదు. నాకెందుకో తెలుసుకోవాలనే కుతూహలం, కాని ఎవరు చెబుతారు. బహుశా జబ్బేమయినా...ఆ వూహ అంతంకాకమునుపే అలాంటిదేదికాదని నా మనస్సు గట్టిగా నొక్కి చెప్పేసింది. మరి... ఆ రాత్రి దృశ్యము, ఆ మనుష్యులు జ్ఞప్తికొచ్చారు. చెలరేగిన ఆలోచనలతో అడుగులు వేసుకుంటు ముందుకు నడుస్తున్నాను.

...హవ్వ...హవ్వ......దానికేం తెగులొచ్చిందే హాయిగా వ్యాపారం చేసుకుంటున్న ముండకి, ఎవడితోనో లేచిపోయిందంటూ.

ఆ...ఆ...ఆ వేపమానికింద అమ్మకుంటే డబ్బులు వస్తాయి-కానీ తాగి తందానా లాడేందుకు మిండగాడు...యిక వినలేక భారంగా అడుగులు వేశాను.

## విజయవాడ, మధు గార్డెన్స్‌లో గాంధీజీ చిత్ర, కల్ప కళా ప్రదర్శన

♦

గాంధీజీ ఏ నిరాడంబరతను, మనకు బోధించారో అలాంటి సౌమ్య, ఆశ్రమ వాతావరణంలో కూడిన విజయవాడ, మొగల్ రాజపురంలోని మధు గార్డెన్స్‌లో గాంధీజీ శత జయంతి సందర్భముగా గాంధీకి జీవిత విశేషాలను ప్రతిబింబించే చక్కటి చిత్ర, శిల్ప కళా ప్రదర్శన ఒకటి గాంధి పాల్ సొసైటీ, గాంధీ పీస్ ఫౌండేషను సొసైటీల సహకారంతో ఆంధ్ర ఎకాడమీ ఆఫ్ ఆర్ట్స్ మరియు మధు గార్డెన్స్ సంస్థలు సంయుక్తంగా యేర్పాటు చేశారు. 2-10-69 వ తేదీ సాయంత్రం 6-30 గంట. లకు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య అధ్యక్షతన శ్రీ మానికొండ సత్యనారాయణ శాస్త్రి ప్రారంభించిన యీ చిత్రకళా ప్రదర్శన 9-10-69 వరకు ఉండింది. ఈ ప్రదర్శనలో గాంధీజీ జననమునుండి అంతిమయాత్ర వరకు వివిధ ఘట్టాలపై ఛాయాచిత్రములు, శిల్పములు, గాంధీజీ ధరించిన వస్తువాహనములు, స్కెచ్‌లు, పోస్టర్లు యీ ప్రదర్శనలో తీర్చి దిద్దారు. అంతేగాక ధాన్యముపై చిత్రీకరణ, అద్దాలపై చిత్రీకరణ, గుంటూరు స్త్రీలకళాశాల లెక్చరర్ సి. యస్. యస్. పట్నాయక్ గారు మలచిన శిల్పాలు యీ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణలు. అన్నిటికంటే చెప్పుకోతగ్గ విశేషము-అపూర్వ వస్తువు - గాంధీజీ పాదాన్ని కొంతకాలం సేవించినవారి కాలి చెప్పు, 1933 లో గాంధీజీ తెనాలి వచ్చినసందర్భములో శ్రీ మొట్టా నరసయ్యగారి కుమారుడు నారాయణరావు (శిల్పి) గాంధిగారిని దర్శించి, వారి పాదధూళి నిమిత్తం పాదాలు స్పృశించారు. గాంధీజీ కదలిపోగా, ఆ కాలి చెప్పుమాత్రం నారాయణరావుగారి వశమైంది. ఆ కాలి చెప్పును వారు స్వయముగా తెచ్చి, నేటిపై ప్రదర్శనలో ఉంచారు. మరొకటి-గాంధీజీ స్వదస్తూరితో వ్రాసిన ఉత్తరము ఒకటి శ్రీ యన్, వి, కృష్ణారావు గారు యీ ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన నాలుగు భాగాలుగా విభజింపబడింది. (1) గాంధీజీ జనం నుండి అంతిమ యాత్రవరకు వివిధఘట్టాలపై ఛాయాచిత్రములు, (2) శిల్పములు, గాంధీజీ ధరించిన వస్తు వాహనములు (3) (3) వివిధపద్ధతులలో చిత్రీకరణ (పెయింటింగ్) - ధాన్యంపై చిత్రీకరణ, అద్దాలపై చిత్రికరణ మొ. నవి, (4) స్కెచ్‌లు, పోస్టర్లు, ఈ ప్రదర్శన పూర్తిగా అభివృద్ది చెందిన ప్రదర్శన అని చెప్పట్నానికి వీలుకాదేమోగానీ, వివిధ ధోరణులను వివరించే చక్కని ప్రదర్శనగా చెప్పవచ్చు.